# కాసానిని గెలిపించి తీరుతాం

**బీసీ వ్యతిరేకి కాంగ్రెస్‌కు బుద్ధి చెపుతాం**

**బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతిని కాంక్షించే బీఆర్ఎస్‌కే మా మద్దతంటున్న బీసీ నేతలు**

ఆది నుంచీ కాంగ్రెస్ పార్టీ బీసీల పట్ల వివక్షత చూపుతూ వస్తున్నదని బీసీ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అధికారంలో ఉన్నామన్న అహంకారంతో ఇష్టం వచ్చినట్లుగా ఆ పార్టీ నేతలు మాట్లాడుతుండడం పట్ల బీసీ నేతలు మండిపడుతున్నారు. బీసీలకు న్యాయం చేయకపోగా.. దమ్ముంటే బీసీ అభ్యర్థిని గెలిపించుకోవాలని రెచ్చగొట్టేలా కాంగ్రెస్ పార్టీ నేతలు మాట్లాడడం సమంజసం కాదని నేతలు పేర్కొంటున్నారు. ఇకనైనా బీసీలు మేల్కొనాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా పలువురు నేతలు గుర్తు చేస్తున్నారు. ఈసారి గెలిపించుకోకుంటే.. రానున్న రోజుల్లో ఏ ఎన్నికల్లోనూ బీసీలకు టికెట్ ఇచ్చేందుకు ఏ రాజకీయ పార్టీ ముందుకు రాదని హెచ్చరిస్తున్నారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతిని కాంక్షించి బీసీ అభ్యర్థికి టికెట్ ఇచ్చిన బీఆర్ఎస్‌కు తమ మద్దతు అని పలువురు నేతలు ఘంటాపథంగా చెబుతున్నారు. ఇదే స్ఫూర్తితో పార్టీలకతీతంగా అన్ని కుల సంఘాలు ఏకతాటిపైకి వచ్చి కాసానిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిస్తున్నారు. బీసీలు తల్చుకుంటే ఏదైనా సాధిస్తారని ఈ ఎన్నికల్లో బీసీ అభ్యర్థిని గెలిపించడం ద్వారా నిరూపించాలన్నారు.



- రంగారెడ్డి, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ)

### బీసీల దమ్మేంటో చూపిస్తాం



పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. బడుగులను చులకనగా చూస్తున్న పార్టీ కాంగ్రెస్. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం. బీసీల ఐక్యతను చాటుతాం. జనాభాలో మెజార్టీగా ఉన్న బీసీల సత్తా చూపెడతాం.

– నర్సింహులు, పర్వతాపూర్, తాండూరు

### బీసీ కులాల ఐక్యత చాటుతాం



ఎన్నికల్లో కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ గెలుపునకు కృషిచేస్తాం. ఉమ్మడి రాష్ట్రంలోనే జ్ఞానేశ్వర్ బీసీ కులాలను ఏకం చేసి రాజకీయ చైతన్యం కల్పించారు. బీఆర్ఎస్ అగ్ర కులాల నాయకులకు టికెట్ ఇవ్వకుండా ఓ బీసీ నాయకుడికి టికెట్ ఇవ్వడం సంతోషంగా ఉన్నది. కాసానిని అధిక మెజార్టీతో గెలిపించి బీసీ కులాల ఐక్యత చాటుతాం.

– ఎం.రాములు, పూడూరు మండలం

### కాసాని గెలుపే ధ్యేయం



చేవెళ్ల పార్లమెంట్ స్థానాన్ని ముదిరాజ్ బిడ్డ కాసానికి కేటాయించడం హర్షణీయం. గతంలో ఎంపీగా గెలిచిన వ్యక్తి ఆస్తులను కాపాడుకునేందుకు కాంగ్రెస్‌లోకి జంప్ అయ్యాడు. కానీ కాసాని కేవలం బీసీల ఐక్యత కోసం తన జీవితాంతం పోరాటం చేస్తూనే ఉన్నారు. బీసీ బిడ్డ కాసానిని భారీ మెజార్టీతో గెలిపిస్తాం.

– శివరామ్, జినుగుర్తి, తాండూరు

### కాసానికి టికెట్ ఇవ్వడం అభినందనీయం



కాసాని గతంలో ఉమ్మడి జిల్లా అభ్యున్నతికి ఎంతో కృషి చేశారు. బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచారు. అలాంటివారు పార్లమెంట్‌లోకి వెళ్తే నిరుపేదల సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. బీసీ నాయకుడికి బీఆర్ఎస్ పార్టీ టికెట్ ఇవ్వడం అభినందనీయం. అధికారం కోసం పార్టీలు మారినవారికి సరైన బుద్ధి చెప్పాలి.

– హన్మంత్, కద్మూర్, పూడూరు మండలం

### బీసీలంతా ఒక్కటవుతారు



బీసీలంగా ఏకతాటి పైకి వచ్చి కాసానిని అధిక మెజార్టీతో గెలిపించుకుంటాం. కాంగ్రెస్ అధికారం చేపట్టిన కొన్ని రోజులకే ఆ పార్టీ నేతలు ఆహంకార ధోరణితో విర్రవీగుతున్నారు. బీసీలకు బీఆర్ఎస్ అధినేత పెద్దపీట వేశారు. జనాభా లెక్కన చూసిన కూడా బీసీలమే అధిక శాతం ఉన్నాం. తప్పకుండా జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుంటాం.

– బీర్బల్, మైతాబ్‌ఖాన్‌గూడ, నవాబుపేట మండలం

### మన ఓట్లు మన నాయకుడికే వేసుకుందాం



ఎన్నికల్లో కాసాని గెలుపొందడం ఖాయం. గతంలో చేవెళ్ల నుంచి ఇద్దరు నాయకులు ఎంపీగా గెలుపొంది తమ సొంత ప్రయోజనాల కోసం ఇతర పార్టీలోకి వెళ్లారు. బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి మన ఓట్లు మన నాయకుడికే వేసుకుందాం. ఎంపీగా జ్ఞానేశ్వర్ గెలుపొందితేనే పార్లమెంట్‌లో బీసీల సమస్యలపై పోరాటం చేస్తారు.

– కుమ్మరి దర్శన్, బీసీ సెల్ నాయకుడు, షాబాద్ మండలం

### బీసీల గళం వినిపించాలి



బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతోకాలంగా కృషిచేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్‌కే మా మద్దతు. బీసీల గళం వినిపించాల్సిన సమయం వచ్చింది. కాంగ్రెస్ నాయకులు ఊసరవెల్లిలా రంగులు మారుస్తారే తప్ప న్యాయం చేయరు. బీసీలకు బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసి సరైన న్యాయం చేసింది. కాసానిని గెలిపించుకుందాం.

– రాఘవేందర్ ముదిరాజ్, పులుమామిడి, నవాబుపేట మండలం

### బీసీలను ఏకం చేసిన నాయకుడు కాసాని



రాష్ట్రంలో 96 కులాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి వారి సమస్యలపై పోరాటం చేసిన ఘనత కాసాని జ్ఞానేశ్వర్‌కే దక్కుతుంది. అలాంటి నాయకుడిని గుర్తించిన కేసీఆర్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించడం గొప్ప పరిణామం. బీసీల సమస్యలు పరిష్కారం కావాలంటే కాసాని ఎంపీగా గెలవాల్సిందే. మన సత్తా చాటాల్సిందే.

– కారు చెన్నయ్య, బోడంపహాడ్, షాబాద్ మండలం

### మా విలువ తెలిసేలా చేస్తాం



కాంగ్రెస్ పార్టీకి బీసీల బలమెంటో తెలిసేలా చేస్తాం. చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్‌కు బీఆర్ఎస్ పార్టీ అవకాశం కల్పించడం మంచి విషయం. ఐకమత్యంతో జ్ఞానేశ్వర్‌కు ఓటు వేసి గెలిపించుకుంటాం. కాంగ్రెస్‌వాళ్లు ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదు. కాంగ్రెస్ పార్టీ పతనం చూడటమే మా లక్ష్యం.

– కృష్ణయాదవ్, కృష్ణా కాలనీ అధ్యక్షుడు, మాదాపూర్

### బీసీ అభ్యర్థికి మద్దతుగా నిలుస్తాం



కాంగ్రెస్ పార్టీ నాయకులు బీసీలను చిన్నచూపు చూస్తే ఊరుకునేది లేదు. మా బలమేంటో అర్థమయ్యేలా చేసి చూపిస్తాం. బీసీ హక్కుల కోసం పాటుపడే నాయకుడు బీసి అభ్యర్థి కాసానిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటాం. బడుగు బలహీన వర్గాలను అణగదొక్కేందుకు కాంగ్రెస్ చేస్తున్న కుట్రలను అడ్డుకుంటాం.

– రాంచందర్, ఇజ్జత్‌నగర్ వార్డు సభ్యులు, మాదాపూర్

### జ్ఞానేశ్వర్ విజయానికి కృషి చేస్తాం



పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ నాయకుడు జ్ఞానేశ్వర్ ముదిరాజ్ విజయానికి కృషి చేస్తాం. బీసీలకు దమ్ము, ధైర్యం ఉంటే కాసానిని గెలిపించుకోండి చూస్తాం అంటూ ఓ నాయకుడు సోషల్ మీడియాలో సవాల్ చేశాడు. ఈ విషయాన్ని బీసీలందరూ గమనించి బీసీ నేత కాసానిని భారీ మెజార్టీతో గెలిపించుకుని మన సత్తా చాటుదాం.

– ఎడ్ల ఉదయ్, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు, కందుకూరు

### బీసీల గళం వినిపిద్దాం



బీసీల గళం వినిపించాల్సిన సమయం వచ్చింది. ఐక్యగా ఉండి ఎన్నికల్లో వెనుకబడిన వర్గాల అభ్యర్థులకు అండగా ఉండాల్సిన అవసరం ఎంతో ఉన్నది. కేసీఆర్ బీసీ వర్గానికి చెందిన కాసానికి బీఆర్ఎస్ టికెట్ ఇచ్చి ఆ వర్గాలపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. కాంగ్రెస్ వక్రబుద్ధికి సమయం చెప్పాల్సిన అవసరం ఉన్నది.

– జయమ్మ రాజు, శాలివాహన సంఘం రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు

## అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి



లక్ష్మణ్(ఫైల్)

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 16 : అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. మండలంలోని కేబిదొడ్డి గ్రామానికి చెందిన బైండ్ల లక్ష్మణ్(42) భార్య పిల్లలతో కలిసి తాపీమేస్త్రి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. లక్ష్మణ్ పెద్దకొడుకు బాల్‌రాజ్ పెయింటింగ్ పనిచేస్తూ సోమవారం శంకర్‌పల్లి మండలం పొద్దుటూరు గ్రామానికి వెళ్లాడు. కాగా.. లక్ష్మణ్ మృతి చెందాడని మంగళవారం బాల్‌రాజ్‌కు సమాచారం అందింది. వెంటనే అతను వచ్చి చూడగా శరీరంపై చిమలు తిన్నట్లు గుర్తులు ఉన్నాయి. కాగా.. అతడి తల్లి నవనీత, చిన్నకొడుకు అనిల్‌తో కలిసి శంషాబాద్‌లో ఉండి తిరిగి ఇంటికి వచ్చింది. దీంతో ఆమెపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి..



శంకర్(ఫైల్)

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 16 : చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బూర్జుగడ్డ తండాకు చెందిన ముడావత్ శంకర్(42).. తన కూతురు స్వాతిని ఇబ్రహీంపట్నంలో ఉన్న హాస్టల్‌లో దింపడానికి బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా.. శంకరాపూర్ వద్ద కుక్క అడ్డురావడంతో వాహనం అదుపుతప్పి కల్వర్టును ఢీకొని కిందపడ్డాడు. తీవ్ర గాయాలైన అతడిని శంషాబాద్‌లోని ఓ ప్రైయివేటు దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఇంటర్నెట్‌పై అవగాహన అవసరం..

**- రిజిస్ట్రార్ డా. వెంకటరమణ**

వ్యవసాయ యూనివర్సిటీ, ఏప్రిల్ 16 : ఇంటర్నెట్‌పై అవగాహన ఎంత ఉంటే ప్రపంచం అంత దగ్గరగా ఉంటుందని విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. ఎం. వెంకటరమణ అన్నారు. రాజేంద్రనగర్ ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం ఇంటర్‌నెట్ , ఈ మెయిల్ సెక్యూరిటీపై వెబ్‌నార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..ప్రపంచమంతా ఇంటర్నెట్‌లో పొందుపర్చి ఉందని వాటిపై అవగాహన అవసరమన్నారు. అందులో మంచీ చెడులు అన్నీ ఉంటాయన్నారు. మరో పక్క సైబర్ నేరాలు పెరుగుతున్నాయని వాటి భారిన పడకుండా ఉండేందుకు ఇటువంటి వెబ్‌నార్ దోహదం చేస్తుందన్నారు. విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని కళాశాలల విద్యార్థులకు అధ్యాపకులకు ,ఇంటర్నెట్ ఈ మెయిల్ సెక్యూరిటీపై అవగాహన కల్పించేందుకు వెబ్‌నార్, సెమినార్‌లను నిర్వహించాలని సూచించారు. హైదరాబాద్ సి– డాక్ ప్రాజెక్టు మేనేజర్ ఎం. జగదీశ్ బాబు , ఇంటర్నెట్, ఈ మెయిల్ సెక్యూరిటీపై అవగాహన కల్పించారు. ఫేక్ మెసేజ్‌ల నుంచి ఎలా కాపాడుకోవాలో సూచించారు. ఈ మెయిల్‌లకు వచ్చే జంక్ మెసేజ్‌లు, స్పామ్ మెసేజ్‌ల నుంచి ఎంత దూరంగా ఉంటే అంత మంచిదన్నారు . ఫేక్ యూఆర్ఎల్‌లను గుర్తించేందుకు అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లపై ఆయన అవగాహన కల్పించారు. ఈ మెయిల్ సెక్యూరిటీ ఆవశ్యకత గురించి కంప్యూటర్ సెంటర్ ఇన్‌చార్జి , ఇంటర్నెట్‌పై అవగాహన , మంచీ చెడులు యూనివర్సిటీ గ్రంథాలయ పాలకుడు డా. ఎన్. రవికుమార్ వివరించారు.ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి విద్యార్థికి ఇంటర్నెట్‌పై అవగాహన అవసరమన్నారు. ఈ వెబ్‌నార్‌లో దాదాపు 150 మంది అధ్యాపకులు విద్యార్థులు, విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ పరిశోధనా సంస్థలు , విద్యార్థులు పాల్గొన్నారు.



వెంగళరావునగర్ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్, ఎమ్మెల్యే మాంగటి గోపినాథ్

# మేమంతా మీ వెంటే ఉంటాం..

**పజ్జన్న పాదయాత్రకు అడుగడుగునా బ్రహ్మరథం.. ఎమ్మెల్యే మాంగటితో కలిసి ప్రచారం**

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 16: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెంగళరావు నగర్ డివిజన్‌లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్.. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాంగటి గోపినాథ్‌తో కలిసి రెండో రోజు ఎన్నికల ప్రచారం, పాదయాత్రలో పాల్గొన్నారు. వెంగళరావునగర్ డివిజన్‌లోని పలు కాలనీల ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు పజ్జన్నకు ఘన స్వాగతం పలుకుతూ మేమంతా మీ వెంటే ఉంటామని అపూర్వ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో కలిసి పద్మారావు గౌడ్ ఇంటింటికీ వెళ్లి ఆత్మీయ పలకరింపులతో బీఆర్ఎస్ ప్రభుత్వం గత పదేళ్లలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు వివరిస్తూ ముందుకు సాగారు. పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో ఒక పార్టీ దేవుళ్ల పేరుతో రాజకీయం చేస్తూ పబ్బం గడుపుకుంటుందని.. మరొక పార్టీ అమలుకానీ హామీలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎలాంటి ఆంక్షలు లేకుడా అమలైన ఆసరా పింఛన్లు, కళ్యాణలక్ష్మి వంటి అనేక సంక్షేమ పథకాలతో కేసీఆర్‌ను ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా చేశాయని అన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో పేద ప్రజలు, రైతుల పక్షాన నిలుస్తున్న బీఆర్ఎస్ పార్టీ ఢిల్లీలో తెలంగాణ గళం వినిపించేందుకు ఈ ఎన్నికల్లో ఒక అవకాశం ఇవ్వాల్సిన అవసరాన్ని విజ్ఞులైన ప్రజలు ఆలోచించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో కార్పొరేటర్లు దేదీప్య రావు, రాజ్‌కుమార్ పటేల్, నాయకులు హేమ, లింగాని ప్రసన్న లక్ష్మి, యువజన విభాగం రాష్ట్ర నాయకులు రామేశ్వర గౌడ్, కిషోర్ గౌడ్, కిరణ్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో భాగంగా వెంగళరావునగర్ డివిజన్‌లో ఓటు అడుగుతున్న ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్, ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్

## ఓటు హక్కుపై అవగాహన

మణికొండ, ఏప్రిల్ 16: రాజ్యాంగం కల్పించిన ఓటు అనే ఆయుధాన్ని వినియోగించుకుంటూ సమసమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్(స్వీప్) నోడల్ ఆఫీసర్, బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర సూచించారు. పార్లమెంట్ ఎలక్షన్–2024 స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఐ ఓటు ఫర్ ష్యూర్ అనే థీమ్‌తో మంగళవారం గండిపేట్‌లోని సీబీఐటీ కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమ ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి ఒత్తిడులకు లోనవకుండా, డబ్బులు తీసుకోకుండా మంచి వ్యక్తికి ఓటు వేసి మంచి సమాజాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నార్సింగి కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్, డీఈఈ నర్సింహారాజు, మేనేజర్ యోగేశ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ వారే లక్ష్మణ్, ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ కోఆర్డినేటర్ జి.ఎన్.ఆర్.ప్రసాద్, మెంబర్స్ కౌశిక్, సుప్రియ, హేమంత్, దిగ్న, నీరజ్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీజేపీని గద్దెదించాలి : ఏఐఎస్ఎఫ్

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 16: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత పదేండ్లుగా ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ విద్యార్థి, నిరుద్యోగులను పూర్తిగా విస్మరించినందున లోక్‌సభ ఎన్నికల్లో మోడీని ఓడించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ పిలుపు నిచ్చారు. బీజేపీని గద్దె దించాలని కోరుతూ ముద్రించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం వారు హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విద్యను ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కషాయికరణ చేసిందే తప్పా విద్యారంగం అభివృద్ధి కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలో వస్తే రాజ్యాంగానికి ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని, అందుకు బీజేపీ హటావో–దేశ్‌కి బచావో అనే నినాదంతో ముందుకు వెళ్తూ విద్యార్థిలోకంను చైతన్యం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేశ్, ఉపాధ్యక్షుడు క్రాంతి, నాయకులు ఎండి, అన్వర్, వంశీ పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ నర్సింగ్ ఆఫీసర్లను పర్మినెంట్ చేయాలి..

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 16: రాష్ట్ర వ్యాప్తంగా వైద్యరంగంలోని నేషనల్ హెల్త్ మిషన్( ఎన్‌హెచ్‌ఎం )స్కీంలో గత అనేక ఏండ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసే నర్సింగ్ ఆఫీసర్లు(స్టాఫ్‌నర్స్)లను పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హిమాయత్ నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఎన్‌హెచ్‌ఎం కాంటాక్టు నర్సింగ్ ఆఫీసర్స్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ ..నర్సింగ్ ఆఫీసర్స్‌ను కాంట్రాక్ట్ పద్ధతిలో నియామకాలు చేపట్టే సందర్భంలో రూల్ ఆఫ్ రిజర్వేషన్, మెరిట్, స్థానికత ఆధారం గా ఎంపిక చేయడం జరుగుతుందని, వీరి సేవలను గుర్తించి పర్మినెంట్ చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. చట్ట ప్రకారం రూ.36,750 జీతం ఇవ్వాల్సి ఉండగా రూ.29,900 మాత్రమే ఇస్తూ శ్రమ దోపిడీకి ప్రభుత్వం గురిచేస్తుందని ఆరోపించారు. నర్సింగ్ ఆఫీసర్స్ అధిక పనిభారంతో సతమతమవుతున్నారని అన్ని స్థాయిల్లో సరిపడా సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ నిశాంతిని, ప్రధాన కార్యదర్శి రాజేష్‌కన్నా, నాయకులు చంద్రకాంత్, మరియ, రత్న కుమారి, వనిత, హిమాబి, సరిత పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను గెలిపిద్దాం..

ఖైరతాబాద్, ఏప్రిల్ 16 : లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ స్థానం నుంచి పోటీ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్ గెలుపునకు చిత్తశుద్ధితో పనిచేద్దామని ఆ పార్టీ నాయకులు కె. రామ్మూర్తి పిలుపునిచ్చారు. సోమాజిగూడలో మంగళవారం ఖైరతాబాద్ నియోజవర్గ బీఆర్ఎస్ సీనియర్ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ..బీఆర్ఎస్‌ను బలోపేతం చేసేందుకు బూత్ స్థాయి నుంచి గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో జరిగిన అభివృద్ధి వివరిస్తూ ప్రజలను ఓట్లు అభ్యర్థించాలన్నారు. త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ కోసం సమావేశం ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి కార్యకర్త హాజరుకావాలని కోరారు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి పార్టీ వెన్నంటి ఉన్నామని, ముమ్ముందు కూడా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వెన్నంటి ఉంటామని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో పద్మారావు గౌడ్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో గుండు నరసింహ ముదిరాజ్, బిట్ల శ్రీనివాస్, రావుల విజయ్ కుమార్, సారంగపాణి, మూర్తి, అయిలయ్య, జానీ నాయక్, కృష్ణ, బాబు, ఖలీల్, గణేశ్,శశి, ఆనంద్, వెంకటేశ్ రాజునాయక్, రాములమ్మ, లలిత, పద్మ, సుజాత, పుష్ప, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు

## ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవాలి

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 16: దేశంలోని ప్రభుత్వ రంగ పరిశ్రమలను మూసివేసి,ప్రైవేట్ పరం చేసేందుకు కేంద్రం కుట్రలు చేస్తుందని .. ఇందుకు యువత పోరాటాలు చేసి వాటిని కాపాడాలని వీక్షణం మాస పత్రిక సంపాదకుడు,కవి ఎన్.వేణుగోపాల్ పిలుపు నిచ్చారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమతి ఆధ్వర్యంలో 'పబ్లిక్ సెక్టార్ల మూసివేత– సమాజంపై ప్రభావం' అనే అంశంపై మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ.. దేశంలో ఐదువేలకు పైగా ప్రభుత్వ రంగ సంస్థలు ఉండగా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2,900 పరిశ్రమలు మాత్రమే మిగిలాయని తెలిపారు. చిన్న తరహా పరిశ్రమల మూసివేతకు మోడీయే కారణమని, దీంతో లక్షలాది మంది నిరుద్యోగులు ప్రత్యక్షంగా ఉపాధి కోల్పోతే, పరోక్షంగా కోట్లాది మందిపై ప్రభావం పడిందని ఆరోపించారు. రాష్ట్రంలో ఉన్న నిజాం చక్కెర ఫ్యాక్టరీకి 7వేల ఎకరాల భూమి ఉందని, ఈ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఏ దేశానికి లేనంత సంపద దేశంలో ఉన్నప్పటికీ పాలకుల వినాశకర విధానాల వల్ల యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు లేవని, యువత చైతన్యవంతమై ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. ఈ సదస్సులో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

## హెరిటేజ్ ఎగ్జిబిషన్..

బంజారాహిల్స్, ఏప్రిల్ 16: వరల్డ్ హెరిటేజ్ డే సందర్భంగా బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని జవహర్‌లాల్ నెహ్రూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ స్టడీస్ ఆధ్వర్యంలో మంగళవారం హెరిటేజ్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో అర్కిటెక్ట్ వసంత శోభ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ..ఎంతో పురాతన చరిత్ర కలిగిన హైదరాబాద్ నగరానికి హెరిటేజ్ సిటీగా యునెస్కో గుర్తింపు సాధించేందుకు తాము కృషి చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని హెరిటేజ్ కట్టడాలు, మ్యాప్‌లు ఈ ఎగ్జిబిషన్‌లో తయారుచేసి ప్రదర్శించారు. త్వరలో ఢిల్లీ వేదికగా యునెస్కో ఆధ్వర్యంలో వరల్డ్ హెరిటేజ్ సదస్సు నిర్వహించనున్నారని, ఆ సదస్సులో భాగంగా హైదరాబాద్‌ను నామినేట్ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఎన్ఐఏఎస్ రిజిస్ట్రార్ డా.డి.సురేశ్, ప్రిన్సిపాల్ శాలిని కాకానితో పాటు అయాన్ అలీ, అసిఫ్ అలీఖాన్, శశాంక్, రాహుల్ . ఇందిర కొల్లి , తదితరులు పాల్గొన్నారు.

## ఏఐ హబ్‌గా హైదరాబాద్ : మంత్రి శ్రీధర్ బాబు

బంజారాహిల్స్, ఏప్రిల్ 16 : భవిష్యత్‌లో హైదరాబాద్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ హబ్‌గా రూపాంతరం చెందుతుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని హోటల్ దసపల్లాలో జరిగిన కార్యక్రమంలో జాయి యాప్‌ను ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుతో కలిసి మంత్రి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జాయి యాప్ వ్యవస్థాపకుడు ప్రణయ్ కొమ్ము, టెక్నాలజీ ఆఫీసర్ రాజ్ నెరవటి తదితరులు పాల్గొన్నారు.